# సాక్షి
## యాదాద్రి భువనగిరి

సోమవారం । 18 । ఆగస్టు । 2025




**ప్రముఖ వైద్యుడు హఠాన్మరణం**
ప్రముఖ వైద్యుడు పీపల్‌పహాడ్ గ్రామానికి చెందిన డాక్టర్ సికిలంమెట్ల రాంప్రసాద్ గుండెపోటుతో కన్నుమూశారు. - 9లో



**అగ్రగామిగా నిలుపుతా**
అభివృద్ధిలో ఆలేరు నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలుపుతానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. - 9లో



**బ్రిడ్జి పూర్తి చేయిస్తా : ఎమ్మెల్యే**
జూలూరు–రుద్రవెల్లి మధ్య మూసీపై లో లెవల్ బ్రిడ్జిని పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. - 9లో

# ఒప్పందం కుదిరితే పాల వెల్లువే..!



గుజరాత్ రాష్ట్రంలోని ఆనంద్‌నగర్‌లో ఎన్‌డీడీబీ కార్యాలయం వద్ద మదర్ డైయిరీ పాలకవర్గం

### మదర్ డెయిరీని నష్టాలనుంచి గట్టెక్కించే యత్నం

- ఎన్‌డీడీబీకి ఆశ్రయించిన పాలకవర్గం
- డెయిరీ ఆస్తులు, అప్పులు, ఇతర అంశాలపై చర్చలు
- సంస్థను అభివృద్ధి చేయడానికి ఎన్‌డీడీబీ సానుకూలం
- ప్రభుత్వం అంగీకరిస్తే కొలిక్కి వచ్చే అవకాశం
- త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలవనున్న నార్మల్ డైరెక్టర్లు

**సాక్షి, యాదాద్రి:** పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయిన మదర్ డెయిరీని గట్టెక్కించే ప్రయత్నాలు మొదలయ్యాయి. సంస్థ పాలకవర్గం ఈనెల 12న గుజరాత్‌కు వెళ్లి ఎన్‌డీడీబీని (జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ)ను ఆశ్రయించింది. ఎన్‌డీడీబీ చైర్మన్‌తో ప్రత్యేకంగా సమావేశమైంది. సంస్థను తీసుకుని లాభాల పట్టించాలని కోరగా అందుకు సానుకూల స్పందన లభించింది. రాష్ట్ర ప్రభుత్వం అంగీకరిస్తే ఎంవోయూ కుదుర్చుకోవడానికి ఎన్‌డీడీబీ సంసిద్ధత వ్యక్తం చేసింది.

**ఆర్థిక సంక్షోభంలో సంస్థ**

ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో విస్తరించి ఉన్న మదర్ డెయిరీ ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. రకరకాల కారణాలతో డెయిరీ అప్పులు పెరిగిపోయాయి. సంస్థను గట్టెక్కించేందుకు పాలకవర్గం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. పైగా రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలు, పాఠశాలలు, హాస్టళ్లకు మదర్ డెయిరీ నుంచి నెయ్యి, పాలు సరఫరా చేసేవారు. దీని ద్వారా మదర్ డెయిరీకి భారీ ఆదాయం సమకూరేది. కానీ, ఆ బాధ్యతలను ప్రభుత్వం విజయ డెయిరీకి అప్పగించింది. దీనికి తోడు మార్కెటింగ్ లోపాల వల్ల ఉత్పత్తుల విక్రయాలు గణనీయంగా పడిపోయాయి. మరోవైపు బ్యాంకుల నుంచి రూ.35 కోట్ల రుణాలు తీసుకోగా, తిరిగి చెల్లించాలంటూ బ్యాంకుల నుంచి ఒత్తిడి పెరిగింది. అంతేకాకుండా 50 వేల మంది పాడి రైతులకు రూ.20 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇక సుమారు 600 మంది ఉద్యోగులు ఉన్నారు. నెలకు రూ.1.20 కోట్ల భారం పడుతుండటంతో వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. దీంతో మదర్ డెయిరీ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. స్థిరాస్తులు అమ్మితే కానీ బయటపడే పరిస్థితి లేదు. ఇదే క్రమంలో నల్లగొండ జిల్లా చిట్యాల వద్ద సంస్థకు చెందిన సుమారు 30 ఎకరాల భూమి విక్రయించాలని నిర్ణయించగా.. వాటిపై కోర్టు స్టే విధించింది.

**చివరి ప్రయత్నంగా..**

చివరి ప్రయత్నంగా మదర్ డెయిరీ పాలకవర్గం ఈనెల 12వ తేదీన గుజరాత్‌లోని ఆనందనగర్‌లో గల ఎన్‌డీడీబీని ఆశ్రయించింది. నాలుగు రోజుల పాటు అక్కడి పరిస్థితులను అధ్యయనం చేశారు. 14న సంస్థ చైర్మన్‌తో ప్రత్యేకంగా సమావేశమై సంస్థను తీసుకుని అభివృద్ధి చేయాలని కోరారు. డెయిరీ ఆస్తులు, అప్పులు, రైతులకు చెల్లించాల్సిన బకాయిలు, ప్రస్తుతం వస్తున్న పాలు, విక్రయిస్తున్న ఉత్పత్తులు, రవాణా చార్జీలు తదితర అంశాలపై ఆయనతో చర్చించారు.మదర్ డెయిరీతో ఎంవోయూ కుదుర్చుకోవడానికి ఎన్‌డీడీబీ అంగీకారం తెలిపింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌వోసీ ఇస్తేనే ఒప్పందం కుదురుతుంది. త్వరలోనే పాలకవర్గం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించనుంది. అంతా సవ్యంగా సాగితే మదర్ డెయిరీ లాభాల బాట పట్టే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ముఖ్యమంత్రిని కలుస్తాం**



మదర్ డెయిరీ అభివృద్ధికి ఎన్‌డీడీబీ సహకారం తీసుకోవాలని నిర్ణయించాం. నాతో పాటు 14మంది మదర్ డైయిరీ డైరక్టర్ల తీర్మానం మేరకు అందరం కలిసి గుజరాత్ వెళ్లాం.ఎన్‌డీడీబీ చైర్మన్‌ను కలిసి చర్చించగా మదర్ డైయిరీని అభివృద్ధి చేయడానికి ఆయన అంగీకరించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలసి త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ప్రభుత్వం నుంచి ఎన్‌ఓసీ ఇప్పించాలని కోరుతాం. ప్రభుత్వం అంగీకరిస్తే ఎన్‌డీడీబీతో ఎంఓయూ కుదుర్చుకుని డెయిరీని కాపాడుకుంటాం.

– గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్

## న్యూస్‌రీల్

### 12వేల మంది దరఖాస్తు



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏడీఏ

**భువనగిరిటౌన్ :** అన్నదాత కుటుంబానికి భరోసాగా నిలుస్తున్న రైతుబీమా పథకానికి జిల్లాలో కొత్తగా 12వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ పథకంలో గతంలో ఒక లక్ష 36 వేల మంది నమోదై ఉండగా.. 588 మంది రైతులు వివిధ కారణాలతో మృతి చెందారు. ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున బాధిత కుటుంబాల ఖాతాల్లో రూ.29.40 కోట్లు జమ అయ్యాయి. గతంలో నమోదైన రైతులందరికీ బీమా రెన్యువల్ చేశారు. కొత్తగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించగా ఈనెల 13న దరఖాస్తు గడువు ముగిసింది.

**10 రోజుల్లోనే బీమా డబ్బులు**

రైతు కుటుంబాలకు ఆర్థికభద్రత కల్పించడం రైతుబీమా ప్రధాన ఉద్దేశం. రైతు ఏకారణంతో చనిపోయినా నామినీ ఖాతాలో ఎల్‌ఐసీ నుంచి 10 రోజుల్లో బీమా డబ్బు జమ చేస్తారు. నమోదైన రైతులకు ప్రభుత్వమే రూ.2,271 ప్రీమియంగా చెల్లించి రూ.5 లక్షల బీమా అందిస్తుంది. జూన్ 5వ తేదీ నాటికి పట్టాదారు పాస్ పుస్తకం కలిగి ఉన్న ప్రతి రైతు దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది.

### హైవేపై వాహనాల రద్దీ



చౌటుప్పల్‌లో బారులుదీరిన వాహనాలు

**చౌటుప్పల్ :** హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. వర్షాల నేపథ్యంలో బుధ, గురువారం విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం, శనివారం శ్రీకృష్ణాష్టమికి తోడుగా పెళ్లిళ్లు, బోనాల పండుగలు ఉండటం, ఆదివారం రావడంతో హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో ఉంటున్న ప్రజానీకం స్వస్థలాలకు వెళ్లారు. వారంతా తిరుగుపయనం కావడంతో అర్ధరాత్రి వరకు కొనసాగింది. వాహనాల రద్దీతో చౌటుప్పల్ పట్టణంలో, జంక్షన్‌ల వద్ద పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### పలుచోట్ల భారీ వర్షం

**సాక్షి యాదాద్రి:** జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 10 గంటల నుంచి 11.30 వరకు కురిసిన వర్షానికి భువనగిరి పట్టణంలో రోడ్లపైకి పెద్ద ఎత్తున వరద నీరు చేరింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### బోనమెత్తారు..



భూదాన్ పోచంపల్లిలో ఆదివారం బోనాలు ఎత్తుకొని ప్రదర్శనగా గ్రామ దేవతల ఆలయానికి వెళ్తున్న మహిళలు
-భూదాన్‌పోచంపల్లి

## పాఠశాలల్లో క్రీడా పండుగ..

- నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు
- మూడు దశల్లో పోటీలు

**భువనగిరి :** పాఠశాలల్లో క్రీడా సంగ్రామానికి తెరలేవనుంది. ఇందుకు పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) వేదిక కానుంది. అండర్ 14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు మండల, ఉమ్మడి జిల్లా, రాష్ట్రస్థాయిలో మూడు దశల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. కాగా మండలస్థాయి పోటీలు సోమవారం(నేడు) ప్రారంభమై 31వ తేదీ వరకు కొనసాగనున్నాయి. సెప్టెంబర్ 1నుంచి 4వరకు జిల్లా స్థాయి, సెప్టెంబర్ మూడో వారంలో ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. గత ఏడాది 50 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

**విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి**

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దశరథరెడ్డి కోరారు. నేటినుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎస్‌జీ ఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశా మని, ఎస్‌జీఎఫ్ క్రీడలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### నిత్యారాధనలు

**యాదగిరిగుట్ట:** యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా అర్చకులు సుప్రభాత సేవ, ఆరాధన చేశారు. గర్భాలయంలో స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, సహస్రనామార్చనతో కొలిశారు. అనంతరం ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. ఇక ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేశారు. రాత్రి స్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.



అలంకరణలో ఉత్సవమూర్తులు



మోత్కూరు మండలం దాచారం స్టేజీ సమీపంలో రోడ్డు పక్కన వ్యర్థ రసాయనాల బస్తాలు



అడ్డగూడూరు మండలం కంచనపల్లి స్టేజీ సమీపంలో..

## అడ్డా మార్చిన కెమికల్ మాఫియా

### గౌరెల్లి–భద్రాద్రికొత్తగూడెం హైవే వెంట రసాయన వ్యర్థాల డంప్

- మూడు ప్రాంతాల్లో 300 బస్తాలకు పైగా గుర్తించిన అధికారులు
- విజయవాడ హైవేపై నిఘా పెరగడంతో ఇక్కడికి తరలించినట్లు అనుమానం
- ఏ కంపెనీకి చెందినవో గుర్తించేందుకు ల్యాబ్‌కు శాంపిల్స్

**మోత్కూరు, అడ్డగూడూరు :** నిబంధనలకు విరుద్ధంగా టన్నులకొద్దీ వ్యర్థాలను నిలువ చేస్తున్న రసాయన పరిశ్రమలు.. వాటిని రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా జాతీయ రహదారుల వెంట, సాగు భూముల్లో పారబోస్తూ కలుషితం చేస్తున్నాయి. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు హెచ్చరించినా ఖాతరు చేయకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. మూడు రోజుల క్రితం గౌరెల్లి–భద్రాద్రి కొత్తగూడెం జాతీయ రహదారి 930 వెంట గుర్తు తెలియని వ్యక్తులు వ్యర్థ రసాయనాలను వాహనాల ద్వారా బస్తాల్లో తీసుకువచ్చి పారబోయడం కలకలంరేపింది.

**గుట్టలుగా వ్యర్థ రసాయనాలు..**

మూడు రోజుల క్రితం వలిగొండ మండలం అరూరు స్టేజీ సమీపంలో, మోత్కూరు మండలం దత్తప్పగూడెం క్రషర్ మిల్లు సమీపంలో, దాచారం స్టేజీ సమీపంలో, అడ్డగూడూరు మండలం కంచనపల్లి సమీపంలో హైవే–930 వెంట పెద్ద ఎత్తున వ్యర్థ రసాయనాలను గుర్తు తెలియని వ్యక్తులు వాహనాల్లో తెచ్చి పారబోశారు. రైతుల సమాచారం మేరకు అడ్డగూడూరు పోలీసులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఆయా ప్రాంతాలను సందర్శించారు. 300కు పైగా వ్యర్థ రసాయన బస్తాలను గుర్తించారు. నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. పరీక్షల రిపోర్ట్ ఆధారంగా వ్యర్థ రసాయనాలు ఏ కంపెనీకి చెందినవో బయటపడుతుందన్నారు.

**మూగజీవాలకు తప్పిన ముప్పు**

వ్యర్థ రసాయనాలు దుర్వాసన వెదజల్లుతుండటంతో రైతులు, రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రసాయన వ్యర్థాలు బొగ్గు, సున్నపు గడ్డలను పోలి ఉన్నాయని పశువులు, జీవాలు తినే ఉంటే మృత్యువాత పడటం లేదా, వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉండేదని వాపోతున్నారు.

**ప్రాణాలతో చెలగాటం**

జిల్లాలో చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రసాయన పరిశ్రమలు ఉన్నాయి. ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ల ద్వారా వ్యర్థాలను నిర్వీర్యం చేయాలన్న నిబంధనలు ఉండగా ఏ ఒక్క కంపెనీ పాటించడం లేదు. వ్యర్థ రసాయనాలను రాత్రి సమయంలో డీసీఎంలలో తీసుకువచ్చి జాతీయ రహదారులు, సాగునీటి కాలువలు, సాగు భూముల్లో పడేస్తున్నారు. అయితే ఇటీవల కెమికల్ మాఫియా అడ్డా మార్చాయి. చౌటుప్పల్ ప్రాంతంలోని పరిశ్రమలు గతంలో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి వెంట రసాయన వ్యర్థాలను పారబోసేవి. కానీ, అక్కడ పోలీస్ పెట్రోలింగ్, హైవే అధికారుల నిఘా పెరగడంతో అడ్డా మార్చినట్లు తెలుస్తోంది. కొత్తగా నిర్మిస్తున్న గౌరెల్లి – భద్రాద్రి కొత్తగూడెం హైవేను ఎంచుకున్నారు. గతంలో ఇలాంటి ఘటనలు ఎప్పుడూ వెలుగుచూడలేదని, పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.



వలిగొండ మండలం అరూర్ స్టేజీ వద్ద రోడ్డు పక్కన వ్యర్థ రసాయన బస్తాలు

**గుర్తించడంతో ముప్పు తప్పింది**



కంచనపల్లి స్టేజీ వద్ద జాతీయ రహదారి వెంట భూమి కౌలుకు తీసుకొని సేద్యం చేస్తున్నా. రోడ్డు వెంట తాను సాగు చేస్తున్న భూమి పక్కన గుర్తుతెలియని వ్యక్తులు రసాయన వ్యర్థాలు పడేశారు. ఉదయాన్నే పొలం దగ్గరకు రాగానే గుర్తించాం. లేకుంటే జీవాలు, పశువులు అక్కడ గడ్డి మేస్తే ప్రమాదం సంభవించే అవకాశం ఉండేది. ఇటువంటి ఘటన ఇదే తొలిసారి.

–కొండాపురం రాములు, రైతు, కంచనపల్లి

**హైవే వెంట నిఘా పెంచాలి**



విజయవాడ హైవే మాదిరిగానే గౌరెల్లి–భద్రాద్రికొత్తగూడెం జాతీయ రహదారిపై పోలీస్ నిఘా పెంచాలి. దీంతో ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా, ప్రమాదాలు సంభవించకుండా నివారించవచ్చు. కంపెనీలు వ్యర్థాలను తెచ్చి హైవే వెంట పారబోయకుండా అడ్డుకోవచ్చు. వ్యర్థాలు పారబోసిన కంపెనీలను గుర్తించి చర్యలు తీసుకోవాలి.

– బుర్ర అనిల్, మోత్కూరు

**ల్యాబ్‌కు శాంపిల్స్ పంపాం**

గౌరెల్లి – భద్రాద్రికొత్తగూడెం జాతీయ రహదారి వెంట మూడు ప్రాంతాల్లో వ్యర్థ రసాయనాలను గుర్తించాం. గుర్తు తెలయని వ్యక్తులు వాహనదాల ద్వారా బస్తాల్లో తీసుకువచ్చి పడేసి ఉంటారు. వాటి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించాం. రిపోర్ట్ రాగానే వ్యర్థాలు దాని ఆధారంగా ఏ కంపెనీకి చెందినవో గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– పురుషోత్తంరెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి బోర్డు అధికారి,

## ఆధునిక సాగుపై ఆసక్తి



మోటకొండూర్ మండలం గిరిబోయినగూడెంలో వరికి మందు పిచికారీ చేస్తున్న డ్రోన్

### వ్యవసాయంలో యంత్రాల వినియోగం

- డ్రోన్లతో మందుల పిచికారీ, రైస్ ట్రాన్స్‌ప్లాంటర్, డ్రమ్ సీడర్లతో వరి నాట్లు
- కోతలు, నూర్పిడి పనుల్లోనూ మిషన్లే..
- రైతులకు సమయం, డబ్బు ఆదా
- ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహం

**యాదగిరిగుట్ట రూరల్:** సంప్రదాయ సాగు పద్ధతుల నుంచి ఆధునిక వ్యవసాయం వైపు మళ్లుతున్నాడు అన్నదాత. ఇటీవల కాలంలో వ్యవసాయంలో యంత్రాల వినియోగం అమాంతం పెరగడం ఇందుకు నిదర్శనం. ఒకప్పుడు దున్నకాలు, వరినాట్లు, కోతలు, నూర్పిళ్లు, మందులు పిచికారీ చేయాలన్నా.. పశువులు, ఎడ్లబండ్లు, కూలీల అవసరం తప్పనిసరిగా ఉండేది. కానీ, సాగు పద్ధతుల్లో అనేక మార్పులు వచ్చాయి. దున్నకాలకు ఇనుప వీల్స్ ట్రాక్టర్లు, వరి నాట్లకు రైస్ ట్రాన్స్‌ప్లాంటర్, డ్రమ్ సీడర్, వీడర్స్, మందు పిచికారీకి డ్రోన్లు, స్ప్రేయర్లు, ధాన్యం తూర్పార పట్టేందుకు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి.

**మందుల పిచికారీకి డ్రోన్ల వినియోగం**

- మనుషులు మందు స్ప్రే చేయాలంటే ఎకరానికి గంట సమయం పడుతుంది. అదే డ్రోన్ సహాయంతో కేవలం ఐదు నిమిషాల్లోనే పూర్తవుతుంది.
- క్రిమిసంహారక మందులు రైతులపై పడకుండా, అనారోగ్య సమస్యలు, దుష్ప్రభావాల నుంచి తప్పించుకోవడానికి డ్రోన్ స్ప్రే ఉపయోగకరంగా ఉంటుంది.
- కూలీల కొరతను అధిగమించవచ్చు. సమయం, డబ్బు ఆదా అవుతుంది.
- పంటకు సమపాళ్లలో ఎరువు అందుతుంది. మందులు వృథా కావు.
- సాధారణంగా ఎకరాకు 200 లీటర్ల మందు పడుతుంది. డ్రోన్ ద్వారా కేవలం 14 లీటర్లు సరిపోతుంది.

**కూలీల కొరతకు చెక్**

వ్యవసాయ పనులు చేయడానికి కూలీలు దొరకడం లేదు. పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. మందు కొట్టడానికి వస్తే ఒక్కరు రోజుకు రూ.1000 తీసుకుంటున్నారు. డ్రోన్ ద్వారా ఎకరానికి కేవలం గంటలోనే మందు పిచికారీ చేయొచ్చు. అదేవిధంగా నాట్లు వేయడానికి ఎక్కువ డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఎకరానికి రూ.8 వేలు తీసుకుంటారు. పంట చేతికొచ్చిన సమయంలోనూ కూలీలు దొరకక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. యంత్రాల వల్ల సమస్యను అధిగమిస్తున్నారు.

**రాయితీపై యంత్రాలు**

కేంద్ర ప్రభుత్వం నుండి డ్రోన్ దీదీ పథకం ద్వారా రైతులకు 50 శాతం సబ్సిడీతో డ్రోన్లు అందజేస్తుంది. అదే విధంగా రోటోవేటర్, పవర్ నాప్‌సోక్ స్ప్రేయర్లు, సీడ్‌కమ్ ఫర్టిలైజ్ డ్రిల్, బ్యాటరీ ఆపరేటెడ్, పవర్ వీడల్, కల్టివేటర్, కెజ్ వీల్స్, బ్రష్ కటర్, పవర్ టిల్లర్, స్ట్రోబెలర్ తదితర పరికరాలను సబ్సిడీపై ఇస్తున్నారు.



రైస్ ట్రాన్స్‌ప్లాంటర్‌తో నాట్లు వేయడానికి పాలిథిన్ కవర్ ట్రేలలో పెంచుతున్న నారు

**రైస్ ట్రాన్స్‌ప్లాంటర్‌తో నాట్లు**

- కూలీల కొరత తీరడంతో పాటుగా, తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో నాట్లు వేస్తుంది.
- నాటు క్రమపద్ధతిలో, మొక్కల మధ్య దూరం సరిగ్గా ఉంటుంది.
- ఎకరం నాటు వేయడానికి కూలీలకు ఒక రోజు మొత్తం సమయం తీసుకుంటుంది. ఇందుకు రూ.8 వేలు తీసుకుంటారు.
- రైస్ ట్రాన్స్‌ప్లనేటర్‌తో ఎకరం గంటలో నాట్లు పూర్తవుతాయి. దీని ఖర్చు రూ.5వేలకు మించదు.
- ఎకరానికి 15 నుంచి 20 కిలోల విత్తనాలు నారుకు సరిపోతాయి.



రాజాపేటలో సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్‌తో విత్తనాలు వేస్తున్న దృశ్యం (ఫైల్)

**సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్..**

- ఆరుతడి పంటలైన పత్తి, కంది, మొక్కజొన్న, పప్పు ధాన్యాలు వంటివి సాగు చేసేటప్పుడు ఈ యంత్రం ఉపయోగిస్తున్నారు.
- ఒకే సమయంలో విత్తనాలు, ఎరువులను వేసుకోవచ్చు.
- రైతుకు సమయం ఆదా అవుతుంది, కూలీల కొరతను అధిగమించవచ్చు. శ్రమ ఉండదు.
- విత్తనాలు ఎంత లోతులో వెళ్లాలో అంతేవరకు వెళ్లి మొక్కలు బలంగా పెరుగుతాయి.
- పంట దిగుబడి కూడా ఎక్కువగా వస్తుంది.



యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట సమీపంలో రైస్ ట్రాన్స్‌ప్లాంటర్‌తో వరి నాట్లు..

**ఖర్చు చాలా తగ్గింది**



నేను రెండేళ్ల నుంచి యంత్రం ద్వారానే వరి నాట్లు వేయిస్తున్నాం. ఎకరం రూ.4,500 ఖర్చు వస్తుంది. గతంలో కూలీలు దొరకక చాలా ఇబ్బంది పడ్డాం. పైగా ఎకరానికి కూలి రూ.8000 తీసుకునేవాళ్లు. రైస్ ట్రాన్స్‌ప్లనేటర్ యంత్రంతో పని సులువైంది. మూడు ఎకరాలు నాటు వేయాలంటే రెండు రోజులు పట్టేది. ఇప్పుడు ఒక్క రోజులోనే నాట్లు పూర్తవుతున్నాయి.

–కరుణాకర్‌రెడ్డి, రైతు, కుమ్మరిగూడెం, యాదగిరిగుట్ట మండలం

**కూలీల సమస్య లేదు**



చేనుకు పురుగు మందులు కొట్టాలంటే కూలీలు దొరకక ఇబ్బందులు పడేవాళ్లం. ఎక్కువ కూలి తీసుకుని కూడా సమయానికి వచ్చేవాళ్లు కాదు. ప్రస్తుతం డ్రోన్‌తో మందులు పిచికారీ చేయిస్తున్నా. దీంతో ఖర్చు తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. డ్రోన్‌తో గంట వ్యవధిలోనే మూడు ఎకరాల వరి పంటకు మందు పిచికారీ చేయించాం.

–వెంకట్‌రెడ్డి, రైతు, మోటకొండూర్ మండలం

**డ్రోన్ కొనుగోలు చేసి ఉపాధి పొందుతున్నా..**



బతుకుదెరువు నిమిత్తం వలసపోకుండా స్వగ్రామంలోనే ఉపాధి పొందాలనుకున్న. డ్రోన్ ఆపరేట్ చేయడానికి శిక్షణ తీసుకున్నా. సొంతంగా రూ.5 లక్షలు ఖర్చు చేసి డ్రోన్ తీసుకున్నాను. మా పొలంతో పాటు ఇతర గ్రామాలకు వెళ్లి డ్రోన్ సహాయంతో మందులు పిచికారీ చేస్తున్నా. ఎకరానికి రూ.500 వరకు తీసుకుంటా. డ్రోన్‌తో రైతులకు ఖర్చు తగ్గుతుంది.

–వినయ్, డ్రోన్ ఆపరేటర్, చిన్నకందుకూరు

## క్లుప్తంగా

### కష్టపడితేనే ఉత్తమ ఫలితాలు : ఎంజీయూ వీసీ


మాట్లాడుతున్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

**నల్లగొండ:** విద్యార్థి దశ నుంచి కష్టపడి చదివితేనే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతోపాటు ఉజ్వల భవిష్యత్ అందు కోగలుగుతారని ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఆదివారం నల్లగొండలో వివిధ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నీట్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు మెడికల్ కౌన్సిలింగ్ నిపుణులు హాజరై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏఏ ఖాన్, షరీఫ్, మొయిజ్, మహమూద్, ఎంఏ పర్వేజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### చేతి ఉత్పత్తులపై పన్ను మినహాయించాలి


మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

**సంస్థాన్ నారాయణపురం:** చేతివృత్తుల ఉత్పత్తులపై ప్రభుత్వం పన్ను మినహాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. చేనేత జాతీయ యువత విభాగంలో అవార్డు గ్రహీత గూడ పవన్‌ను ఆదివారం సంస్థాన్ నారాయణపురంలో శ్రీనివాస్‌గౌడ్ సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ యువతకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలుతో పాటు స్వయం ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గం అధ్యక్షుడు వీరమళ్ల కార్తిక్, మండల అధ్యక్షుడు బొల్లేపల్లి లక్ష్మణ్, దూసరి వెంకటేశం, కొత్త భాను, ఉప్పరగోని రాజు, జోకు స్వామి, లక్ష్మణ్, చిరంజీవి, శ్రీకాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతున్న యువకుడు మృతి


పవన్ కుమార్ (ఫైల్)

**మోటకొండూర్:** పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మోటకొండూర్ మండలం తేర్యాల గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కనికునూరి పవన్ కుమార్(22) బోడుప్పల్‌లోని అభయ ఆస్పత్రిలో ఫార్మసీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 15న డ్యూటీకి వెళ్తున్నాని తేర్యాలలో తన ఇంటి నుంచి బయలుదేరి మండలంలోని ఆరెగూడెం శివారులోని వెంచర్‌లో పురుగు మందు తాగాడు. అనంతరం తన స్నేహితులు, బంధువులకు పురుగుల మందు తాగినట్లు సమాచారం ఇచ్చాడు. దీంతో వెంటనే పవన్ వద్దకు వెళ్లిన బంధువులు అతడిని భువనగిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించి చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి తదిశ్వాస విడిచాడు. మృతుడి బంధువు మత్స్యగిరి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు. మృతిగల కారణాలు తెలియరాలేదు.

### బైక్ అపహరణ

**ఆత్మకూరు(ఎం):** మండల కేంద్రంలో మజ్జిగ రాంబాబుకు చెందిన టూవీలర్ బైక్( టీఎస్ 30–హెచ్8353)ను శ్రీకనకదుర్గ దేవాలయ సమీపంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు పోయారు. రాంబాబు కుమారుడు వ్యవసాయ బావి నుంచి ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు లిఫ్టు అడగడంతో బైక్‌ను ఆపాడు. దీంతో అతని చేతిలో నుంచి బైక్‌ను లాక్కెళ్లారు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

# రోడ్డు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

- ఏడుగురు వ్యక్తులకు గాయాలు
- చివ్వెంల, గుండాల, చందంపేట, డిండి మండలాల పరిధిలో ఘటనలు

ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. ఏడుగురు గాయపడ్డారు. చివ్వెంల మండలం గుంజలూరు స్టేజీ వద్ద ఒకరు, గుండాల మండలం బండ కొత్తపల్లి వద్ద, డిండి మండలం పెద్దతండాలో, చందంపేట మండలం పోలేపల్లి గేటు సమీపంలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం నలుగు వ్యక్తులు మృత్యు వాతపడ్డారు.

**డివైడర్‌ను ఢీకొట్టిన బైక్.. ఒకరి మృతి**


మృతుడు భానుప్రకాశ్ (ఫైల్)

**చివ్వెంల :** బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన చివ్వెంల మండలం గుంజలూరు గ్రామ స్టేజి వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన నత్త భానుప్రకాశ్ (22), అతని స్నేహితులు మణిదీప్, పవన్ ముగ్గురు బైక్‌పై విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వస్తున్నారు. గుంజలూరు స్టేజీ వద్దకు రాగానే వారి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న భానుప్రకాశ్ తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగతా ఇద్దరికి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను కూడా సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి.మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

**ట్రాక్టర్ ఢీకొనడంతో మరొకరు..**


గుండాల : బండకొత్తపల్లిలో ట్రాక్టర్ ఢీకొనడంతో మృత్యువాత పడిన రామగిరి శ్రీరాములు

**గుండాల :** మద్యం మత్తులో అతివేగంతో ట్రాక్టర్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలైన సంఘటన గుండాల మండలం బండ కొత్తపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం గ్రామంలో బోనాల పండుగను పురస్కరించుకొని గ్రామానికి చెందిన సంగు శ్రీను ట్రాక్టర్‌ను గ్రామ దేవతల చుట్టూ అతివేగంతో తిప్పుతుండడంతో అదుపు తప్పి గ్రామానికి చెందిన రామగిరి శ్రీరాములు (55) ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు చెప్పారు. పోతుగంటి లింగన్న, బుర్ర శేఖర్‌కు గాయాలైనట్లు పేర్కొన్నారు. గాయాల పాలైన వారిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇందులో లింగన్న పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

**ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని ఇంకొకరు..**

**డిండి:** ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా మరొక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం డిండి మండలం పెద్దతండా సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చెర్కుపల్లి గ్రామానికి చెందిన ముడి రాములు(58), ముడి శ్రీను తమ అవసరాల నిమిత్తం మండలంలోని బొల్లనపల్లి గ్రామానికి వెళ్లి బైక్‌పై స్వగ్రామానికి తిరుగి వస్తున్నారు. ఈ క్రమంలో దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డిండి నుంచి చెర్కుపల్లి స్టేజీ మీదుగా దేవరకొండకు వెళ్తోంది. ఈ సమయంలో పెద్దతండా సమీపంలోకి రాగానే ముడి శ్రీను నడుపుతున్న బైక్, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో బైక్ వెనుక కూర్చున్న ముడి రాములు రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన శ్రీనును దేవరకొండ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం రాములు మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పజెప్పారు. మృతుడి కుమారుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

**లారీని ఢీకొన్న కోళ్ల వ్యాన్ ఒకరి మృత్యువాత**

**చందంపేట:** ఆగి ఉన్న లారీని కోళ్ల వ్యాను వెనుకనుంచి ఢీకొనగా ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం వేకువజామున చందంపేట మండలంపోలేపల్లి గేటు సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డిండి నుంచి వడ్ల లోడ్‌తో దేవరకొండకు వెళ్తున్న లారీని వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కోళ్ల వ్యాను ఢీకొట్టింది. కోళ్ల వ్యానులో ఉన్న గుర్రంపోడు మండలం జిన్నాయిచింత గ్రామానికి చెందిన భూతం లింగయ్య(45)కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యాను డ్రైవర్ కుంటి గొర్ల సైదులు, మరో వ్యక్తి వడ్లమల్ల రాఘవేందర్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భూతం లింగయ్య మృతదేహాన్ని కూడా పోస్టుమార్టం నిమిత్తం అదే ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు భార్య ఇందిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు.

## మిస్టరీగా మారిన ఈశ్వర్ మృతి

- న్యాయం చేయాలంటూ బంధువుల ఆందోళన

**మిర్యాలగూడ అర్బన్:** మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన యువకుడు ఈశ్వర్ మృతి మిస్టరీగా మారింది. శనివారం రాత్రి కాలనీ శివారులో అనుమానాస్పదంగా మృతిచెందిన యువకుడిని ప్రేమ వ్యవహారంలో హతమర్చారా..? లేక రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మాదగోని సత్యనారాయణ, నాగమణి దంపతుల కుమారుడు మాదగోని ఈశ్వర్(19) ఈ ఏడాది ఇంటర్ పూర్తిచేసి స్థానికంగా ఓ కళాశాలలో డిగ్రీ ఫస్టియర్ చదువుతున్నాడు. కొంత కాలంగా పట్టణానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నట్లు తన స్నేహితుల ద్వారా తెలిసింది. అయితే మృతుడు నడుపుతున్న బైక్ మృతదేహానికి వంద అడుగుల దూరంలోని పొలంలో పడి ఉండడం.. గొంతుపై కత్తితో కోసినట్లుగా గాయం ఉండడంతో హత్యగా కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందితే.. మృతదేహం తల, ఇతర భాగాలపై గయాలు కనిపించాలి కానీ అలాంటి ఆనవాలు కనిపించకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈశ్వర్ మృతిచెందిన విషయం అతడు ప్రేమించిన యువతికి తెలియడంతోపాటు మృతదేహం ఫొటోలు ఆమె ఫోన్‌కు వీడియోలు పంపడం వెనుక హత్యకుట్ర దాగి ఉన్నట్లు కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కులాంతర ప్రేమను విచ్ఛిన్నం చేసేందుకు పథకం ప్రకారం హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.


పోస్టుమార్టం వద్ద గుమిగూడిన మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు

**బాధ్యులను కఠినంగా శిక్షించాలి**

మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి మార్చురీ వద్ద కాలనీ వాసులు, బంధువులు చేరుకుని తమకు న్యాయం చేయలని ఆందోళన వ్యక్తం చేశారు. వన్‌టౌన్ పోలీస స్టేషన్‌కు వెళ్లి ఈశ్వర్ మృతికి బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆందోళనకారులతో వన్‌టౌన్ సీఐ మోతీరాం మాట్లాడుతూ ఈశ్వర్ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని..త్వరలోనే నింధితులను గుర్తించి మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈశ్వర్ తిరిగిన ప్రాంతాలను సీసీ ఫుటేజీల ద్వారా పరిశీలిస్తున్నామని, మృతుడి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని అతడి కాల్ డేటాను సేకరిస్తున్నామని చెప్పారు. సీఐ హామీతో మృతుడి బంధువులు ఆందోళన విరమించుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈశ్వర్ తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని సీఐ పేర్కొన్నారు.

### పాపన్నగౌడ్ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా శ్రీకాంత్‌గౌడ్


శ్రీకాంత్ గౌడ్

**నాగారం :** బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా నాగారం మండలం మామిడిపల్లికి చెందిన గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కపురి శ్రీకాంత్‌గౌడ్‌ను నియమిస్తూ ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను కన్వీనర్‌గా నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

### ఐదుగురిపై కేసు నమోదు

**నార్కట్‌పల్లి:** మండల కేంద్రంలో ఓ హోటల్‌పై దాడి చేసిన ఘర్షణలో ఐదుగురిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీదేవి ప్రసాద్ హోటల్‌కు శనివారం రాత్రి కొందరు యువకులు వచ్చి క్యాషియర్‌తో గొడవపడి హోటల్‌లోని సామగ్రి, ఫర్నిచర్‌ను పూర్తిగా ధ్వంసం చేశారు. హోటల్ యజమాని శెట్టి ప్రవీణ్‌కుమార్ సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఘర్షణ పడిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. హోటల్ యజ మాని ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన బోడ నవీన్, మేడి స్వామితో పాటు మరో ముగ్గురిపై ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

## కొడుకు ప్రేమ వివాహం.. కుమార్తెల పేర ఆస్తి రాసిన తండ్రి

- దుకాణం ఎదుట భైఠాయించిన నవ దంపతులు
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన పంచాయితీ

**భువనగిరిటౌన్ :** కొడుకు ప్రేమ వివాహం చేసుకోవడంతో అతడి తండ్రి తన ఆస్తిని కుమార్తెల పేర వీలునామా రాశాడు. ఈ ఘటన భువనగిరి పట్టణంలో శనివారం వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి పట్టణానికి చెందిన ఓ వ్యాపారి కుమారుడు జ్ఞానేశ్వర్ తన స్నేహితురాలైన గుండాల మండలం సుద్దాలకు చెందిన సౌమ్యతో ఇరు కుటుంబాల అంగీకారంతో మే 22న యాదగిరిగుట్టలో వివాహం చేసుకున్నారు. కానీ అప్పటి నుంచి ఆగ్రహంగా ఉన్న జ్ఞానేశ్వర్ తండ్రి ఈ నెల 16న తన ఆస్తిని తన ఇద్దరు కూతుర్ల పేరిట వీలునామా రాశారు. అదే రోజు సాయంత్రం తనను తన భార్యను ఇంటి నుంచి వెళ్లిపోవాలని గెట్టివేసినట్లు జ్ఞానేశ్వర్ ఆరోపించారు. ఈ క్రమంలో జ్ఞానేశ్వర్ తన భార్యతో కలిసి తన తండ్రి నిర్వహించే దుకాణం ఎదుట ధర్నాకు దిగాడు. ఈ పంచాయితీ పోలీస్ స్టేషన్‌కు చేరడంతో పోలీసుల జోక్యంతో తాత్కాలికంగా సద్దుమణిగింది. జ్ఞానేశ్వర్ తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్ తెలిపారు. సోషల్ మీడియాలో ఈ ఘటన ట్రోలింగ్‌గా మారింది.


దుకాణం వద్ద భైఠాయించిన జ్ఞానేశ్వర్, సౌమ్య

### అలరించిన 'కూచిపూడి'


నృత్యం చేస్తున్న బాలికలు

**భువనగిరి :** భువనగిరి మండలం రాయగిరిలోని మినీ శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ నృత్య ప్రదర్శనలు అలరించాయి. భారతి నాట్య డ్యాన్స్ గురు ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య కళా ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. వరుసగా పాఠశాలలకు సెలవులు రావడంతో యాదగిరీడుడి సన్నిధికి వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో మినీ శిల్పారామాన్ని సందర్శించి నృత్య ప్రదర్శనలను తిలకించారు.



## పోలీస్ జాగిలం పింకీకి అంతిమ వీడ్కోలు



పింకీ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఏఎస్పీ, గౌరవ సూచకంగా గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

**నల్లగొండ:** పన్నెండేళ్ల పాటు విశేష సేవలందించిన పోలీస్ జాగిలం పింకీ (ట్రాకర్) అనారోగ్యంతో ఆదివారం తుది శ్వాస విడిచింది. అనేక కేసుల్లో నేరస్తులను డిటెక్ట్ చేసి పోలీస్ శాఖకు పట్టించిన పింకీ విధి నిర్వహణలో కీలక పాత్ర పోషించింది. పింకీ అంత్యక్రియలను ఆదివారం పోలీసులు అధికార లాంఛనాలతో జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు.


పోలీస్ జాగిలం పింకీ మృతదేహం

**పలు కేసుల దర్యాప్తులో కీలకంగా..**

ఉమ్మడి జిల్లాలో విధినిర్వహణలో భాగంగా పింకీ పలు కేసులో దర్యాప్తులో కీలకంగా వ్యవహరించింది. నల్లగొండ వన్‌టౌన్ పరిధిలోని బొట్టుగూడలో ఒక వ్యక్తిని ముక్కలుగా నరికి కాళ్లు, చేతులు, మొండెన్ని వేర్వేరు చోట్ల పెట్టిన కేసు పరిశోధనలో కీలక పాత్ర పోషించింది. నల్లగొండలో జూలకంటి ఇంద్రారెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద జరిగిన రూ.1.40 కోట్ల చోరీ కేసులో గంటల వ్యవధిలో నిందితు ల జాడను తె లిపింది. గుండాల మండలం వంగాలలో ఒక వ్యక్తిని చంపి బావిలో పడవేసిన వారం తర్వాత నిందితుల ఇళ్లలోకి వెళ్లి పసిగట్టింది. ఇలా ఎన్నో కేసుల్లో నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పింకీ మృతిపట్ల ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సంతాపం తెలిపారు.

**పింకీ సేవలు మరువలేనివి : ఏఎస్పీ రమేష్**

పోలీస్ జాగిలం పింకీ సేవలు మరువలేనివని ఏఎస్పీ రమేష్ అన్నారు. ఆదివారం పింకీ అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో ఐబిటీ మొయినాబాద్‌లో తొమ్మిది నెలలపాటు డాగ్ హ్యాండ్లర్ నాగరాజుతోపాటు శిక్షణ పొందిన పింకీ శిక్షణ కాలంలోనే ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్‌ఐ సంతోష్, ఆర్‌ఎస్‌ఐ రాజీవ్, డాగ్ హ్యాండ్లర్ నాగరాజు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది కరుణాకర్, సంపత్, సతీష్, గోపాల్, మహేంద్ర, నరేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీల్లో జిల్లాకు మంచిపేరు తేవాలి

- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**హుజూర్‌నగర్ :** కబడ్డీ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో సూర్యాపేట జిల్లాకు మంచి పేరు తేవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో యువ ప్రో కబడ్డీ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ఎంపికైన జిల్లా క్రీడాకారుల జట్టును మంత్రి క్యాంప్ కార్యాయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ గల క్రీడాకారులకు తమ సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను ప్రోత్సహిస్తున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ను అధ్యక్ష కార్యదర్శులు అల్లం ప్రభాకర్‌రెడ్డి, నామ నరసింహారావు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, తన్నీరు మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో మంత్రి ఉత్తమ్

## ఆర్‌ఎంపీపై సుమోటోగా కేసు నమోదు

**తుంగతుర్తి :** ఆర్‌ఎంపీ చికిత్స వికటించి మహిళ మృతి చెందిన ఘటనపై స్పందించిన తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం సదరు డాక్టర్‌పై సుమోటోగా కేసు నమోదు చేసినట్లు తెలంగాణ మెడికల్ వైద్య మండలి వైస్ చైర్మన్ డాక్టర్ గుండగాని శ్రీనివాస్ తెలిపారు. వైద్యం వికటించి మహిళ మృతి అనే వార్త వివిధ పత్రికల్లో ప్రచురితం కావడంతో ఆదివారం తుంగతుర్తిలోని సాయి బాలాజీ ప్రైవేట్ ఆస్పత్రిని సందర్శించి విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగతుర్తిలో ఆర్‌ఎంపీ శ్రీనివాస్ కొన్నేళ్లుగా ప్రభుత్వ అనుమతులు లేకుండా సాయి బాలాజీ ఆస్పత్రి నిర్వహించడంతోపాటు గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు చేయిస్తున్నారని స్థానికులు తెలిపారన్నారు. ఆయన వెంట డాక్టర్ విష్ణు తదితరులు ఉన్నారు.

**అర్హత లేకుండా వైద్యం చేస్తే కఠిన చర్యలు**

**భానుపురి (సూర్యాపేట) :** సూర్యాపేట జిల్లాలో అర్హత లేని వైద్యులు ఆస్పత్రులు నిర్వహిస్తూ వైద్యం చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. తుంగతుర్తిలోని సాయి బాలాజీ ఆస్పత్రిలో అబార్షన్ సమయంలో వైద్యం వికటించి మృతి చెందిన గర్భిణి కేసుపై కలెక్టర్ ఆదివారం తీవ్రంగా స్పందించారు. ఈ విషయంపై తక్షణమే విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌ఓ వెంటనే తుంగతుర్తిలోని సాయి బాలాజీ ఆస్పత్రిని సందర్శించి విచారణ చేపట్టారు. ఆర్‌ఎంపీ కొరివిల్ల శ్రీనివాస్ అబార్షన్ చేయడం వల్లే విజేత అనే గర్భిణి మృతిచెందిందని డీఎంహెచ్‌ఓ తెలిపారు.


ఆస్పత్రిలో విచారణ అనంతరం మాట్లాడుతున్న మెడికల్ కౌన్సిల్ బృందం సభ్యులు



## యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ


కొండపైన శివాలయం సమీపంలో భక్తజన సందోహం

**యాదగిరిగుట్ట:** యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో పాటు శ్రావణ మాసం ముగుస్తుండడంతో శ్రీస్వామిని దర్శించుకునేందుకు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన దాదాపు 45 వేల మంది భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు రద్దీగా కనిపించాయి. భక్తులు అధికంగా రావడంతో శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి మూడు గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.58,05,696 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.


శ్రీస్వామిని దర్శించుకున్న ఫ్రాన్స్ దేశస్తులు

**శ్రీస్వామి సన్నిధిలో ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పూజలు**

యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేంద్రమోహన్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న ఆయనకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

**సంప్రదాయ దుస్తుల్లో విదేశీయులు**

**యాదగిరిగుట్ట:** యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఫ్రాన్స్ దేశస్తులు ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం బ్రేక్ దర్శనం సమయంలో సంప్రదాయ దుస్తులు ధరించి శ్రీస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు శ్రీస్వామి వారి ఆలయ నిర్మాణ శైలిని ఫ్రాన్స్ దేశస్తులకు వివరించారు. హైదరాబాద్‌కు వచ్చిన క్రమంలో యాదగిరీశుడిని దర్శించుకునేందుకు వచ్చినట్లు వారు వెల్లడించారు.

## ఆరు తరాల ఆత్మీయ బంధం

**నిడమనూరు :** మండలంలోని గుంటిపల్లి గ్రామానికి చెందిన ఆరు తరాల ఉప్పల వంశీయులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ వంశానికి చెందిన ఉప్పల శ్రీనివాస్, ఉప్పల రాధాకృష్ణ, ఉప్పల సత్యనారాయణ, ఉప్పల కేశవులు, నిరంజన్ వివిధప్రాంతాల్లో స్థిరపడ్డారు. వీరు నెల రోజులపాటు తమ వంశీయుల సమాచారం సేకరించారు. దీంతో ఆదివారం వంద మందికిపైగా కుటుంబ సభ్యులు మండల పరిధిలోని కోటమైసమ్మ అమ్మవారి సన్నిధిలో ఒక్కటై రోజంతా ఆనందంగా గడిపారు.

సమ్మేళనంలో పాల్గొన్న ఉప్పల వంశీయులు →

